కథానిక:

మమకారం!

శ్రీ కె. జి. ఆచార్య

"బాబుగారూ !..."

....

"బాబుగారూ !... బాబుగారూ...!..."

గీస్తోగీస్తోవున్న పెన్సిలు గబుక్కున ఆగిపోయింది. ఆ పెన్సిలు నడకల్ని చూస్తోచూస్తోవున్న నా చూపులు అటు తిరిగినయ్.

ముసీలితాత !

ఏదో వ్యథకొద్దీ వణికితోతూన్న ఆ ఆరాటపు మాటలకు తగినట్టుగనే, ఏదో ఆశకొద్దీ అల్లల్లాడి పోతూ ముందుకు వస్తోన్న ఆ చివికి శరీరం, ఆ చింకిగుడ్డలూ, ఆ క్షీణప్రాణం—ఒక్కసారి హృదయాన్ని వూపివేశాయ్ !

ఆ మూడుకాళ్ల ముసలివాడు గడప దాటి, హాల్లోకి వస్తూనే వున్నాడు; నా చూపులు అలాగే అతన్ని చూస్తూనే వున్నయ్ !

"ఏయ్... ఇక్కడేమీ లేద్...ఫో !"— నా ప్రక్కనే వున్న మూర్తి అదేసమయంలో అలా గసురుతాడని నే ననుకోలేదు.

నా చూపులు చివుక్కుమన్నయ్.

"ఉండవోయ్... ఎందుకొచ్చాడో కనుక్కుకుండా..."

"ఇంకెందుకు వస్తాడు ? అడుక్కోడానికి ! ఈ వెధవలికి యెక్కడికి. వెళ్లి అడుక్కోవాలో గూడా తెలీదు !"

"అదే తెలిస్తే, వాళ్లకి అడుక్కునే ఖర్మేం పట్టింది ?"— మూర్తికి ఎప్పుడూ మరామేకుగా వుండే రాజు, యీ సమయంలోనైనా ఓ విసురు విసరకుండా వుండలేదు !

"బాబు...గారూ !..."

ఏయ్, నీకే చెప్పేది...ఇదే మనకున్నావ్ ఇల్లూ దుకాణమూ గాదు ! బొమ్మలు వేసుకునే స్కూలు ! ఫో !..." మూర్తి మరింత వుగ్ర మూర్తిగా అన్నాడు.

అయితే, ఆ తాతమటుకు దగ్గిరకంటా రానే వచ్చాడు. "తెలుసును బాబూ, తెలుసును. బొమ్మ లేసుకునే యిస్కూలని తెలుసును. అందుకే వచ్చాను. యెతుక్కుంటూ, యెతుక్కుంటూ...వచ్చాను, అంత దూరాన్నుంచి ! ఆ బాబుగారేరి బాబూ ? ఆ...బాబుగారు ?" అడిగాడు.

ఆ అడగడంలో ఏదో ఆరాటం వుంది; హృదిలో జాలిని నింపే వ్యథ వుంది.

"ఏ బాబుగారు...తాతా ?" వెంటనే అడిగాను.

"ఆ బాబుగారే,...ఆ రామంబాబుగారు !"

"ఎందుకూ ?"

"ఆయనగారు నన్ను చాలా కాలంనుంచి యెరుగుదురు నాయనా! వొక్కసారి పిలవండి... వొకటి అడగాలి...ఆ వొరని..."

"అలా బజారుకు వెళ్లారు. ఇప్పుడే వస్తారు, కూర్చో !" అన్నాను.

చేతిలో కర్రని అలా ప్రక్కగా జారేస్తో, "అయ్...క్రిష్ణా !...క్రిష్ణా!..." అంటూ ఎంతో కష్టంమీద కాయాన్ని కూర్చోబెట్టాడు.

తాత అవస్థ అదో తరహాగా కనిపిస్తోంది. అసలు, ఎక్కడో చూచిన జ్ఞాపకం! 'మోడల్' వేస్తున్నానన్నమాటేగాని, ధ్యాస అంతా తాతమీదే వుంది. మధ్యమధ్య చూపులు తాతవేపే మూస్తున్నయ్ !

నాతోబాటు 'మోడల్' వేస్తోన్న మూర్తీ, రాజూ, సత్యం, వర్మా—అందరూ తాతవేపే దృక్కుల్ని మరల్చి, తాతహెడ్ స్టడీ చేయాలని, ఏవేవో తర్జనభర్జనలు పడుతున్నారు.

ఆ ప్రసంగాల్లో నే నేమీ కలుగజేసికోలేదు. అయితే, మనసుమటుకు మూగప్రసంగం చేస్తూ ఉంది తాతనుగురించే! ఎక్కడో చూచినట్టు జ్ఞాపకం! కాని, ఎంత పరకాయించి చూచినా గుర్తు రావడంలేదు !

"ఏం...తాతా, నీ బొమ్మ వేస్తాం, దీ గంటసేపు కూర్చోగలవా ?" సత్యం అడిగాడు.

కళ్లు మూసుకుని, ఏమేమో...పెదిమలు కదుపుకుంటూన్న తాత, వాళ్లవేపు చూశాడు:

"నా బొమ్మ యేస్తారా బాబూ? నా బొమ్మ? వొద్దు నాయనా, వొద్దు ! ఆ కిష్టుడి బొమ్మేయండి...చాలు !"

వృద్ధాప్యంలో మానవునికి ఆశ్రయమయింది ఒక్క దైవభక్తే నను సంగతిని యీ జవాబుతో తాత సమర్థిస్తున్నా డనుకున్నాను.

"నీ బొమ్మ అక్కర్లేదూ ? వేయించుకో తాతా, ఎంచక్కా వుంటావ్ !" మూర్తి అన్నాడు.

"వొద్దుబాబూ,......వొద్దు ! మా కిష్టుడి బొమ్మ యేస్తే చాలు...అపుడెపుడో...రామం బాబుగారు యేశారు, వాడి బొమ్మ ! అచ్చంగా వాడిలానే వుంది...వాడిలానే ! రామంబాబుగారు యింకా యెపుడొస్తారో ?...ఆ బొమ్మ ఒక్కసారి కళ్లారా చూసి పోతాను...మా కిష్టిబాబుని...యెన్నాళ్లయిందో చూసుకుని..." అంటూ అనుతాపంతో మరింత వణికిపోయాడు.

"ఏ క్రిష్టుడు, తాతా ?..." అర్థంగాక, ఆతృతగా అడిగాను.

"మా, కృష్టుడే బాబూ...మా అబ్బిగాడు. కిట్టిబాబు..."

"మీ వాడి బొమ్మ రామంగారు, వేశారా ?"

"అవును, బాబూ ! యేశారు...వాడు బతికున్నరోజుల్లో... బంతిలా ఆడుకునేరోజుల్లో!.

ఆ బొమ్మ చూస్తే... అచ్చంగా కిట్టిబాబుని చూచినట్టేవుంది. ఆ గుండరని మొకం... ఆ పెద్దకళ్లూ... ఆ మెళ్ళో యేండి కంటె... అచ్చంగా మా కిట్టిబాబునే యేశారు...చక్కగా కూకోబెట్టి ... అదే వుందేమోనని చూట్టానికి వచ్చాను. మా బాబు పోయినా, బొమ్మలో అయినా చూస్తాను... బొమ్మలో ! ఇంకా, యెప్పుడొస్తారు, నాయనా ?... రామంబాబుగారు ?" —తాతఆతృత అధికమౌతూంది.

అంతలోనే డ్రాయింగుమాస్టారు లోపలికి వచ్చారు. వస్తూ వస్తూనే అన్నారు: "మోహన్ యింకా రాలే దేమిటోయ్ ?... అని."

"లేదండి,... మీకోసమని యీ తాత యెవరో యిందాకట్నించి కూర్చున్నాడు..." అన్నాను.

"ఎవ రది ?" అంటూనే మాస్టారు తాతవేపు చూచారు.

"దణ్ణాలండి, బాబూ !... దణ్ణాలు !—" తాత లేవలేక కూర్చునే నమస్కరించాడు.

"ఎవరూ ?..." గుర్తు పట్టలేక చూస్తూ వుండిపోయారు మాస్టారు.

"నేనండి బాబూ !... అప్పన్నని... మరచిపోయారా బాబూ ?"

"ఓహో, నువ్వా అప్పన్నా !... ఎప్పుడొచ్చావ్ ? బాగా ముసిలాడివైపోయావే ! చూడగానే గుర్తు పట్టలేకపోయాను సుమా !"

"ముసిలాణ్ణి అయిపోక యేముంది బాబూ! కిట్టిబాబు పోయాక మరీ ముసిలాణ్ణి అయిపోయాను !" ముసిలిగొంతుక మరింత గద్గదికమైపోయింది.

"ఏమిటీ, కృష్ణుడు పోయాడా ?... ఎప్పుడూ !" మాస్టారు ఆశ్చర్యంగా—ఆతృతగా—అడిగారు.

"మీకు తెలీదా బాబూ ?... అయ్యో, క్రితం పెద్దపండక్కి పోయాడు !... నా తండ్రి !..."

"ఎక్కడ ? సాలూరులోనే ?"

"కాదండి,...జయిల్లో."

"ఆఁ...? జైల్లోనా ? అసలు, జైల్లో ? యెందుకు వేశారు? నేరం యేమిటి ?...అయినా వాడి సంగతి నే నెరుగుదున్లే...వెధవ...... యెప్పుడూ పెంకితనంగా వుంటూవుండేవాడు. నిన్ను కష్టపెట్టని రోజుందా ? అసలు, ఎవడినో తెచ్చుకొని పెంచుకోవడం నీది బుద్ధితక్కువ ! ఇంతకీ, ఏం నేరం చేశాడేమిటి ?" ఆతృతగా అడిగారు మాస్టారు.

ఎంచాతనో నాలోనూ ఆతృత గలిగింది. బోరును కిందవుంచి తాతజవాబుకోసం - మాస్టారితోబాటు నేనూ ఆత్రంగా చూస్తూ వుండిపోయాను.

"అలా గనకండి బాబూ ! నా బాబు...నా కిట్టిబాబు...పోయాడు...ఎన్ని బాధలు పెడితేనేం ? బతికుంటే బాగుండేది !...ఏదో తెలీక చిన్న తప్పుచేసేసరికి జైల్లో యేశారు. ఇక అక్కడే నిండు నేణాలు వొదిలేడు నాతండ్రి!" కన్నీరు కారుస్తూ వుండిపోయాడు.

....

"బాబుగారూ, మిమ్మల్ని వొక్కటి అడుగుదామని వొచ్చాను. గ్యాపకం వుందాండీ ? చానాకాలం క్రితం వాడిబొమ్మలు యేశేవోరు. ఓసారి రంగురంగుల్లో మంచిబొమ్మొకటి యేశారు...అది వుంటే వొక్కసారి యిస్తారు బాబూ ? చూచుకుంటాను నా చిన్నిబాబుని; నా కిట్టిబాబుని..."

"అబ్బో ఎప్పుడో వేశాను, ఎక్కడుందో వెతికి యిస్తానుగానీ, అసలు వాడు జైల్లో ఎందుకు పడ్డాడు ?"—తెలుసుకునే తొందరను కనబర్చారు మాస్టారు.

"ఆగొడవంతా చాలా వుందండి, బాబయ్యగారూ...నాబాబు యేదో చిన్న తప్పు చేశాడని జైల్లో యేశారు.! ఆ యెంకట్రావుబాబుగారు వూరుకుంటే యింత జరక్కపోను ! ఆ గొడవంతా మెల్లగా చెప్పుకుంటాన్లే... బాబు. ముందు ఆ బొమ్మ చూపించరూ ? ఆ బొమ్మ !"— ఆలస్యాన్ని సహించలేకపోతున్నాడు తాత !

మాస్టారు విసుపోతూ వెళ్లారు.

"ఏం తాతా, సాలూరులో యెక్కడ వుండేవాడివి ?..." అడిగాను.

బొమ్మకోసం ఆరాటపడుతున్న తాతకు నా ప్రశ్న వినిపించనే లేదు !

సాలూరూ, అప్పన్నా — అనగానే మా సాలూరు మామయ్యా, మామయ్యగారి తోటా- ఆ తోటలో వుండే అప్పనా - ఎప్పుడో యేడాదిక్రితం చూచినవారంతా - జ్ఞాపకానికి వచ్చారు. ఒక్కక్షణం తేరిపారజూచాను. ఆఖరికి గుర్తుపట్ట గలిగాను !" ఏం తాతా ! వెంకట్రావుగారి తోటలో వుండేవాడివి కదూ ?... అడిగాను.

గతుక్కుమన్నాడు. "అవునుబాబూ !..." అనిమాత్రం అన్నాడు. "అక్కడ నన్నెప్పుడైనా చూచావా ?..." అడిగాను మళ్లీ.

తాత మరి జవాబివ్వలేదు. తన ధోరణిలో వున్నాడు. "అయ్యో !... కిట్టిబాబూ ! ఇవేళ మళ్లీ నీ చిన్నప్పటి మొఖం చూచుకుంటాను... బాబూ!... నా బాబూ!..." అంటూ కన్నీరు పెట్టుకుంటున్నాడు.

అడిగినదానికి జవాబివ్వకపోవటంచేత నాకొంత మరీ ఆరాటం కలిగింది. మళ్లీ అడిగినా మాటాడలేదు.

మాస్టారు వెతికివెతికి ఆబొమ్మ తెచ్చారు... పన్నెండువదమూడేళ్ల కుర్రాడి బొమ్మ అది. మాస్టారు హ్యూమన్‌మోడలుగా వేశారు. చక్కని టచ్చెస్ యిచ్చారు.

తాత బొమ్మ తీసుకొని... వణికిపోతూన్న చేతుల్లో పట్టుకొని— అనుతాపంగా చూస్తూ, తన కిట్టిబాబురూపాన్నీ, గుణాల్నీ—రకరకాలుగ పొగుడుకుంటూ—వలవల యేడ్వసాగాడు.

"ఎందు కేడుస్తావ్. వూరుకో అప్పన్నా!... నేను చెప్పనేచెప్పాను. అసలు నువ్వు వాణ్ణి పెంచుకోవటమే తప్పు ! వాణ్ణి నెత్తిన యెక్కించుకున్నావు...అదే నిన్నిలా పాడుచేసింది...ఇంతకీ. వాడెంచేత జైల్లో పడ్డాడు ?..." మాస్టారు అడిగారు.

"చెపుతా బాబూ...కాస్త గుండెల్లో బరువు తగ్గేక, చెపుతాను...సాయంత్రం వొచ్చి... కూర్చొని...తీరుబడిగా చెపుతాను...అని యింకా వలవల యేడుస్తూ కూర్చున్నాడు.

అలాగే కొంతసేపు గడిచింది. ఆఖరికి, ఆ బొమ్మ తీసుకొని వెళ్లిపోయాడు.

సంగతేమిటని అప్పుడే మాస్టార్ని అడిగాను.

మాస్టారు చెప్పారు: "ఆ ముసిలాడు ఒకప్పుడు కొంత డబ్బున్నవాడే ననీ, ఎవడినో కుర్రాణ్ణి తెచ్చుకొని పెంచుకున్నాడనీ, వాడు యేడెనిమిదేళ్లక్రితం తనదగ్గిర మోడల్‌బోయ్‌గా వుండేవాడనీ, వాడు వొట్టి పోకిరిబోతు అయినా యీ ముసిలాడు యెంతో ప్రేమతో ఆదుకువచ్చాడనీ..." యింకా—సంగతి కొంతవరకూ వినిపించారు.

"మరి అయితే, ఆతర్వాత వీళ్లు సాలూరు వెళ్లారాండీ ?..." నా అనుమానం పూర్తిగా తీరక ప్రశ్నించాను.

"అవును, ఆ వెధవ యీ పెంచుకున్న ముసిలాడిదగ్గిఱ స్థిరంగా వుండేవాడు కాదు. కొద్దిగ గట్టిగ మాట్లాడితే, అసలుతండ్రిదగ్గిరకు పరుగెత్తుకుపోయేవాడు. ఆఖరికి, వాణ్ణి విడచి వుండలేక యీముసిలాడుగూడా ఇక్కడివన్నీ అమ్ముకొని, అక్కడికే పోయి కాపురం వున్నాడు.

"సాలూరులో మా మామయ్యగారి తోట్లో పనిచేశేవాడంటి యీ ముసిలాడే! అక్కడ

(16-వ పేజీ చూడుడు)

అమెరికాలోని భారత రాయబారి శ్రీమతి విజయలక్ష్మి పండిట్ పశ్చిమ రాష్ట్రాల్లో పర్యటించి అమెరికా పారిశ్రామిక వేత్తలకు భారతప్రభుత్వ వైఖరిని వివరించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో తీసిన పై చిత్రంలో ఉన్నీ నాయర్, జార్జి క్రిస్టాఫర్, విజయలక్ష్మి పండిట్, జనరల్ క్లార్క్, యస్. కె. కృపలానీ.

మమకారం

(7-వ పేజీ తరువాయి)

యిరవై రోజులుపైగా వున్నాను. రోజూ చూస్తూంటే వాడినిగదా .. ఒక్కసారి గూడా యెవరితోనూ కలిసి మెలిసి మాట్లాడే వాడు గాడు."

"మీ మామయ్యగారి తోట్లో వుండేవాడా? అసలు, యీ ముసిలాడు పనీ పాటా యేమీ చేసేవాడు గాడే! ఇంట్లో వండుకుతినటం, వూళ్లో తనవాళ్లకు అప్పు లివ్వటం, వసూలు చేసుకోవటం – యిదే పని!"

"ఏమోనండి, మరి... సరిగ్గా – పిడి నే అక్కడ చూచాను."

"అయితే అయివుండవచ్చునేమో! ఆ కుర్ర వెధవమటుకు బహుపోకిరీవాడు. అలాంటి వాణ్ణి యీ ముసిలాడు పెంచుకొని, తనను యీ దుర వస్థకు తెచ్చుకున్నాడు. పాపం.... ఒకప్పుడు ఎంతో బాగా బతికినరకం!" మాష్టారు నిట్టూర్చారు.

"పాపం వీడి కొడుకు జైల్లో యెందుకు పడ్డాడో!" అన్నాను సానుభూతిగా.

"అదే చెప్పాడుగాడు... వాడెంత తప్పు చేసినా, ముసిలాడు చెప్పకోడు, అదేమి ప్రేమో ఏమిటో!" అన్నారు.

ఇలా మాట్లాడుకుంటూండగానే యెవరో వచ్చారు మాష్టారుకోసం! ఇక ప్రసంగం ముగిసింది.

ఇటు తిరిగాను, మా బృందమంతా యింకా డ్రాయింగువేసే ధోరణిలోనే వున్నారు. ఎవరికీ అక్కరలేనిది నాకేం పట్టిందనుకున్నాను.

ఇక, ఆవేళ సాయంత్రం లాండ్‌స్కేప్ వేయడానికి గోదావరిగట్టుకు పోయాం. అందుచేత తాతనుగురించి తెలుసుకోటానికి అవకాశం లేకపోయింది.

* * *

మర్నాడుదయమే ఇంటినుంచి బయలుదేరాను, సత్యాన్ని తీసుకొని ఆర్టుషాపులకు వెళ్దామని. వాడింటి సందుదగ్గరకు వచ్చేనో లేదో, సత్యం యెదురయ్యాడు, "ఓ, శేఖర్, నిన్నటి నీ తాత మరిగదా!" అంటూ. విని వినగానే ఒక్కసారిగా కంపించిపోయాను. "ఎక్కడా?" అని మాత్రం ఆతృతగా అడగగలిగాను.

"అదిగో...చూడు, ఆ సత్రంఅరుగుమీద పడివున్నాడు. అంతమంది గుమిగూడింది అందుకే!"

అటు పరుగెత్తాను. గుంపుని తప్పించుకొని చూచాను. పాపం, ప్రాణాలు వదిలేసి వున్నాడు. అంతకంటే ఆశ్చర్యం! ఆ యెండిపోయిన గుండెలమీద తన క్రిష్ణుడి బొమ్మని రెండుచేతులతో అదిమిపెట్టుకొని వున్నాడు. అలాగే ప్రాణం విడిచాడు గాబోలు, అభాగ్య జీవి!! తన క్రిష్ణుణ్ణికలుసుకోవటానికి వెళ్తున్నానని చెప్తూన్నట్టుగా ఆనందపడుతోంది ఆ ముఖం! ఒక్కసారిగా నా కళ్లు చెమ్మగిల్లాయి. నిట్టూర్చాను బాధగా!

ఇక అక్కడ వుండలేదు. సత్యం కంటే ముందే, గబగబ మాష్టారింటికి పరుగెత్తాను చెప్పటానికి.

వినీవినగానే – ఒక్కసారి విస్తుపోయారు మాష్టారు; ఆ ముసిలాడి ప్రేమకి విస్మయం జెందారు.

ఆతర్వాత – మాష్టారూ, నేనూ–! ముసిలాణ్ణి దహనంచేసేందుకు యేర్పాట్లన్నీ చేసివచ్చాము.

మాష్టారడిగాడు: "పాలూరులో వుండే మీ మామయ్య పేరు వెంకట్రావుగారుగదూ?..." అని.

"అవునండి!" అన్నాను.

"అయితే, నిన్న నువ్వు చెప్పింది నిజమే! మీ మామయ్యగారిదగ్గర యీ ముసిలాడు తోట మాలిగా పనిచేసేవాడట. నిన్న సాయంత్రం వచ్చి కొడుకుసంతా చెప్పుకున్నాడు."

"అయితే, వీడు పెంచుకున్నవాణ్ణి జైల్లో యెందుకు వేశారంటే?..." కుతూహలాన్ని ఆగబట్టలేక అడిగేశాను.

"అదంతా చెప్పాడు. ఆ క్రిష్ణుడు తన కన్న తండ్రిప్రోద్బలంతో ఓ అర్ధరాత్రివేళ...యీ ముసిలాడి పూరింటిని తగలబెట్టేశాడుట. దాంతో ముసిలాడి సామానూ, డబ్బూ దస్కమూ అంతా ధ్వంసమైపోయింది. అప్పట్నుంచి దిక్కులేనివాడై పోయాడు!"

"మరి, అలాంటివాడిమీద యింకా ఆ ప్రేమెందుకో? బొమ్మ అడిగి వాడేదకకు అంతలేక పోయాడు!" యేమిటో ఆ ముసిలాడి ప్రేమని అర్థంచేసుకోలేక అన్నాను.

"నాకూ అదే ఆశ్చర్యంగా వుంది. నిన్న నా యంత్రం వచ్చినప్పుడు సంగతంతా చెప్పాడు గానీ, ఆ కిష్టిగాడిదే తప్పు అనిమాత్రం వొప్పుకోడు. నా కెంతో మంచివాడట. ఆ ముఖ్యం, కళ్లూ మంచి అదృష్టమైన వట! మరి, చచ్చిన తర్వాత గూడా ఆ అదృష్టాన్నిఒరించే పోతాడేడు! వాణ్ణి పెంచుకొన్నప్పటినుంచీ తన యింట్లో లక్ష్మి వుండేదట! అయితే, వాడు తన యిల్లు తగలపెట్టినా, తిట్టుకోడు! పోనీ అమాయకుడుగాకపోతే, వాడు తండ్రిదగ్గరికి పారిపోగా, తను వుండలేక-ఇక్కడున్నది అమ్ముకొని అక్కడికి పరుగెత్తాడు. వాడు రాత్రిళ్లు సినిమాలకు వెళ్లి పేకార్లు కొట్టి వచ్చేసరికి వేలకి వండింది చక్కగ అమర్చి పెట్టి వానితో ఆడుకునే వాడు! ఉన్న కాస్త పొలం అమ్మి, జోరుగ పెళ్లి గూడా చేశాడట"

"అక్కడ ఆ క్రిష్ణుడి తండ్రికీ, యీ ముసిలాడికీ పడేదిగాదట. వాడు యేలాగైనా యీ ముసిలాడిదగ్గరున్న దవ్వంతా లాక్కుందామనే యెత్తుతో వుండేవాడట; ఈ కుర్రవెధవని మధ్యపెట్టి-ముసిలాడిమీదకి కత్తి నూయించేవాడట!

"ఓసారి-ఉన్న యింటిని తనపేర వుంచమనీ, డబ్బుయిమ్మని-క్రిష్ణుడిచేత అడిగించాడట. అసలు, మొదటనే ఉన్నదంతా వాడికే వ్రాసి యిచ్చాడు ముసిలాడు. అయితే, ఎక్కడ పాడు చేస్తాడో అని భయంచేత ఆ పత్రాలు యివ్వాడు గాదు. ఆ కోపంతోనే, కుతంత్రం పన్ని-ఓనాటి రాత్రి ముసిలాడి యింటికి నిప్పంటించాడు. ఉన్న లొడ్డూలొటుక్కూ అంతా భస్మమైపోయింది. ముసలాడు యెట్లాగో బయటపడ్డాడు. ఇంతపనీ,స్వయంగా ఆకిష్టిగాడే చేసివుంటాడు. అయినా, ముసిలాడుమటుకు వాడిమీద పెట్టడు.

ఇక వీడికి వుండడానికి ఇల్లూ వాకిలీ లేకపోయింది; తినడానికి తిండీ లేకపోయింది. అప్పుడు మీ వెంకట్రావుమామయ్యగారే ఆదరించారట. వారి తోటలో కొంతకాలం పనిచేశాడు. ఈఘోరం అంతా చూచిన మీ మామయ్యగారు క్రిష్టుడిమీదా, వాడితండ్రిమీదా-కేసు పెట్టించి జైల్లో వేయించారట.

జైల్లో పడిన కొన్ని నెలలకే - క్రిష్టిగాడు హఠాత్తుగా చనిపోయాడు. ఇక అప్పటినుంచి ముసిలాడు మరీ బెంగపెట్టుకున్నాడు. అప్పటికీ, మీ మామయ్యగారిమీద కోపం వచ్చిందేగాని, కిష్టిగాడిమీద కోపం రాలేదు. తోటపని మానుకొని-పిచ్చెత్తినట్టుగా వూరూరా తిరుగుతూ యిక్కడికి వచ్చాడు. నే నెప్పుడో వాడి బొమ్మలు వేసినట్లు జ్ఞాపకం వచ్చిందిగాబోలు, ఇక్కడికి పరుగెత్తుకు వచ్చాడు.

"ఆఖరికి, బొమ్మకూడా చూచుకొనిమరీ యేడ్చుకున్నాడు. రాత్రంతా బొమ్మని గుండెలమీద అదిమిపెట్టుకొని యేడుస్తూ తుదకు ఆ వున్న అల్పప్రాణంకాస్తా అర్పుకున్నాడు!! ఇంతకీ, వా డెన్ని బాధలు పెట్టినా, తనను చంపడానికి పూనుకొన్నా వాడిమీద ప్రేమమటుకు విడిచిపెట్టేడుగాదు! ఇలాంటి విచిత్రవ్యక్తులుగూడా వుంటారుగాబోలు, ఈ లోకంలో!" నిట్టూర్చుతూ చెప్పటం ముగించారు.

సంగతంతా వినేసరికి నా కమితాశ్చర్యం వేసింది. పెంచేవాళ్లకి కొందరికి - యిలాంటి ప్రేమగూడా వుంటుందా? అని.

ఆ రోజునే, తాతది - చిన్న పోర్ట్రెయిట్ చిత్రం వొకటి చిత్రించాను స్మారకచిహ్నంగా!

స్కాటిష్ బూచి!

(15వ-పేజీ తరువాయి)

సైనికులున్నారు. ఇదేమీ తెలియని ఆవిడ పాపం, మెల్లిగా గోడమీద కూచుని పాపాయికి జోలపాడుతోంది. ముందు ఏ కేది తెలుసా? ఇంగ్లీషు వాళ్లకి డగ్లస్‌పేరంటే ఎంత భయం వచ్చిందంటే, ఆడవాళ్లు ఆపేరు చెప్పి పిల్లల్ని భయపెట్టేవాళ్లు. వాళ్లు మారాము చేసినప్పుడల్లా 'నల్లడగ్లస్ బూచి' కిచ్చేస్తా మని బెదిరించేవాళ్లు. మరి ఈమె పాడుతోంది.

లేదమ్మా – లేదే...నా చిట్టిపాపా!
నా చిన్నిపాపా!...భయపడకురా
నల్లబూచి, డగ్లసుమామా! నిన్నెత్తుక
పోడురా!

"ఏమో! నువ్వెట్లా చెప్పగలవ్?" ఆవిడకక్కడించే ఏదో గొంతు మాట్లాడింది. అదేసమయంలో ఒక బలమైన చెయ్యి, ఇనపతొడుగుతో ఆమె భుజం మీద వాలింది. ఆమె పక్కకి చూసేటప్పటికి, అంతవరకు ఎవరినిగురించి పాడుతోందో ఆ 'బూచి డగ్లసే!' పొడుగాటి, కండలు తిరిగిన, బలమైన మనిషి బాగా దగ్గరలో నిల్చున్నాడు. అప్పుడే అక్కడ ఒహారాసిపాయి దగ్గరున్న గోడలు ఎక్కుతూ ఇంకో స్కాచివాడు కనపడ్డాడు. ఆ సిపాయి, హెచ్చరిక ఇచ్చేసి, తన బల్లెంతో అతని మీదికి పరిగెత్తాడు. ఆ స్కాచు దొంగ పేరు సైమన్ లెడ్‌హౌస్. ఆ దెబ్బ తప్పించుకుని, సిపాయికి బాగా దగ్గరికొచ్చేసి ఈకెత్తో పొడిచేశాడు. తక్కిన స్కాచివాళ్ళంతాకూడా వాళ్లననుసరించి, డగ్లస్‌కి లెడ్‌హౌస్‌కి సహాయం చేశారు. కోట పట్టుబడిపోయింది. చాలామంది సైనికుల్ని చంపేశారు. అయితే డగ్లస్, ఆవిడని పాపని కాపాడాడు. స్కాటిష్ బూచి, నల్లడగ్లస్‌ని గురించి ఆమె ఇంకెప్పుడూ పాడలేదని ధైర్యంతో చెప్పగలను నేను!

వేణువాద్యము

(10వ-పేజీ తరువాయి)

ముగా నున్నది. అయినను సప్తరంధ్రములను ఎడమచేతి మూడువ్రేళ్లతోను కుడిచేతి నాలుగువ్రేళ్లతోను మూయు పద్ధతి శిలప్పాధకార గ్రంథమునను తదితరసంగీతగ్రంథము లన్నింటిలోను ఒకేవిధముగ చేర్కొనబడినది.

వేణువు తయారుచేయుట కుపయోగింపవగినపదార్థములు:—

(1) వైణవి (వెదురు) (2) కేదార (యజ్ఞస్తంభమున కుపయోగించు కఱ్ఱ) (3) దంతము (4) శ్రీగంధపు చెక్క (5) చందనపుకఱ్ఱ (6) రక్తచందనపుకఱ్ఱ (7) ఇనుము (8) కంచు (9) వెండి (10)స్వర్ణము మొదలగునవి. పైవాటిలో వెదురు అన్నిటికంటె శ్రేష్ఠమైనది. ఇందుకు కారణమేమనగా వెదురునుండివచ్చుధ్వనియొక్క ప్రాశస్త్యమున్ను, చక్కని ప్రతిధ్వని నిచ్చుస్వభావములే వెదురుయొక్క శ్రేష్ఠతకు కారణముగు నున్నది.

వేణువుగొట్టమున కుండవలసిన నియమములు

(1) నూటిగానుండి వంకరగాని, గణుపులుగాని, సందులుగాని, బుసుపులుగాని లేకయుండవలెను. (2) రెండువైపుల గణుపులు లేనిదిగా యుండవలెను. (3) వెదురు మిక్కిలి ప్రాతదిగాగాని మిక్కిలి క్రొత్తదిగాగాని యుండరాదు. (4) వెదురు అడవిలో నున్నప్పుడు గాలివీచిన అటునిటు కదలకయున్నదిగా యుండరాదు. (5) తుమ్మెదలు మొదలుగాగల పురుగులు రంధ్రములు పొడిచినదిగా యుండరాదు. అయితే యిప్పటి విద్వాంసులలో కొందరు గణుపులుగల వేణువులుగూడ వాడుచున్నారు.

వేణువు నభ్యసించు క్రమము

(1) వేణువును వక్త్రరంధ్రము యొక్క అంచును క్రింది పెదవికి నానించుటయును, (2) రెండుచేతుల బొటనవ్రేళ్లతో పట్టుకొని నిట్టనిలువుగా నుంచుటయును (3) వ్రేలిరంధ్రములలో మొదటి నాలిని (ఎడమునుంచి కుడిప్రక్కకు) ఎడమచేతి 3, 2, 1 వ వ్రేళ్లతోను, 4, 5, 6 7 రంధ్రములను కుడిచేతి 1, 2, 3, 4 వ్రేళ్లతోను, మూయుటకును, తెరచుటకును సిద్ధముగా నుంచుకొనుటయే వేణువాద్యము నభ్యసించుటలోగల ముఖ్యవిషయము లని తెలియునది. వ్రేలిరంధ్రములు కుడిచేతివైపున నుండులాగున వేణువును పెదవికి చేర్చి పట్టుకొనవలెను. ఇట్లు వేణువును పెదవికి నానించి వక్త్రరంధ్రము లోనికి నోటితో గాలిని ఊదుటచేతనే వేణువునకు సహజమును సుశ్రావ్యమైన ధ్వని కల్గుచున్నది. ఈ ధ్వనికల్గినపిదప వ్రేళ్లతో రంధ్రములను మూయుట, తెరచుటచేత వివిధములగు స్వరముల పలుకుచున్నవి.

వేణువునందు గమకములు పలికించు విధము

(1) ఊదుచుండునపుడు ముఖమును పైకి ఎత్తుటచేతగాని క్రిందికి వాల్చుటచేతగాని పలికింపవచ్చును. ఇందుచేత గొట్టములోనికి ప్రవేశించు గాలియొక్క పరిమాణము మారును. మరియు ఊదునట్టి వక్త్రరంధ్రముయొక్క వైశాల్యము మారును. (2) వ్రేళ్లతో రంధ్రములను మూయుటలో చివాలున మూయక క్రమేణ మూయుట వలనగూడ గమకము పలికింపవచ్చును. (3) ఊదునట్టిగాలి తేలికగానూదుట లేక గట్టిగా నూదుటవలన కూడ గమకము పలికింపవచ్చును.

వేణువాద్యమునందు ముఖ్యముగా గమనింపవలసిన విషయములు—(1) గాలిని ఊదుటలో సమానతయు సావధానము నుండవలెను. అనగా ఎక్కువపోత పోయరాదు. తక్కువగా పోతపోయరాదు, నిలకడగా నుండవలెను. (2) ధ్వనిహీనముగా నుండరాదు. మరియు కఠినముగాను ప్రతిధ్వనించులాగున నుండరాదు. [illegible] స్వభావ ముండరాదు. (3) వాయువును స్వాధీనముగా పోనీయవలెను. (4) గాత్రపుపాట కొంతవఱకు అభ్యాసము చేసితీరవలెను. (5) వ్రేళ్లను వాడుటలో చక్కని ప్రావీణ్యము సంపాదింపవలెను. రాగములను వాయించుటలో నిపుణులుగా నుండవలెను.

(6) గాలి నూదుటలో బుస బాలావరకు తగ్గునట్లు అభ్యాసము చేయవలెను.

వేణువుయొక్క శాస్త్రము

వేణువుయొక్క శృతి, ధ్వనిసాంద్రత, ధ్వని స్వభావము ఈ క్రిందివాటిపై ఆధారపడియుండును.

(1) వేణువును తయారుచేసిన కఱ్ఱ లేక పదార్థము.

(2) అట్టి కఱ్ఱ లేక పదార్థపు మందము, బరువు.

(3) గొట్టపు గర్భము నూటిదై హెచ్చుతగ్గులు లేకుండుట.

(4) వైశాల్యము.

(5) వక్త్రరంధ్రమునకున్ను వ్రేలి రంధ్రములకున్ను గల దూరము.

(6) ఊదబడు గాలియొక్క పోత (తీవ్రత)

(7) వక్త్రరంధ్రముయొక్క వైశాల్యము.

(8) వ్రేలి రంధ్రములను పూర్తిగా మూయుట లేక పాక్షికపుమూత.

(1) ఏ పదార్థముతో చేసినను అనగా కొయ్యగాని, వెదురుగాని, దంతముగాని, గ్లాసుగాని యేర్పడు శ్రుతి యొక్కటియే. కాని ధ్వనిభేద ముండును. (2) గొట్టముగర్భము నూటిగా లేనియెడల అనగా ఎక్కడ కొలిచినను ఒకటే వైశాల్యము లేనియెడల ధ్వని ఒకేతీరుగా నుండదు. (3) ఈ గర్భముయొక్క వైశాల్యము ఎక్కువ అయినయెడల ధ్వని మంద్రము అగును. తక్కువ అయినయెడల "తార" అగును. (4) ఊదబడు గాలియొక్క బలము నుబట్టి శ్రుతియున్ను, ధ్వనియొక్క ఆకృతియున్ను మారును. స్వరాంతర్యాదికృతులపర్యంతము రాగ,తాన పల్లవులను చక్కగా అభ్యసించిన వేణువాద్యమునందు మెళకువలుగూడ తెలుసుకొనవలసి యున్నది.